# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com
ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 30-8-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి:30 సంచిక:23 పేజీలు:6 వెల: రూ.1/-


## సెప్టెంబర్ 1న భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకలు : సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, ఆగష్టు 29: స్వాతంత్ర్య భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలను సెప్టెంబర్ 1వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. వజ్రోత్సవ ముగింపు వేడుకల ఏర్పాట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణ చారి, దేశపతి శ్రీనివాస్, డీజీపీ అంజనీ కుమార్‌లతో కలిసి సీఎస్ సమీక్షించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ హెచ్ఐసీసీలో జరిగే వజ్రోత్సవ ముగింపు ఉత్సవానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ( ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, జడ్పీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు, డీసీసీబీ, డీసీఎంఎస్, రైతు బంధు సమితుల అధ్యక్షులు, ఆల్ ఇండియా సర్వీస్ అధికారులతో సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు.

సుమారు గంటసేపు దేశ భక్తి, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని కలిగించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ సందేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ వజ్రోత్సవ ముగింపు వేడుకలకు పటిష్ట నిఘా, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ సుల్తానియా, జితేందర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులకు.. ఆర్థికం సాయం అందజేసిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, ఆగష్టు 29:చదువుతోనే సమాజంలోని సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని పంచాయతీరాజ్ శాఖ ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి పసుల రమేశ్ పాండిచ్చేరిలోని ఓ యూనివర్శిటీలో ఎంఎస్సీ మైక్రో బయాలజీలో ఉన్నత విద్యాభ్యాసం కోసం సీటు సాధించాడు. నిరుపేద వర్గానికి చెందిన రమేశ్‌కు అక్కడి వెళ్లి చదువుకొనే స్థోమత లేదు.

కాగా, రమేశ్ మంగళవారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి పర్వతగిరి మండలకేంద్రంలోని మంత్రి నివాసానికి వెళ్లి తన పరిస్థితిని వివరించాడు. వెంటనే స్పందించిన ఎర్రబెల్లి రమేశ్ విద్యాభ్యాసం కోసం రూ.50వేల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యత కారణంగా సమాజంలో వేగవంతమైన వృద్ధిని సాధించలేక పోతున్నామన్నారు. అమెరికా, జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాలు అభివృద్ధిపథంలో దూసుకుపోవడానిక

## పారా మెడికల్ కోర్సులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపు

హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పారా మెడికల్ కోర్సులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపజేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి వైద్యారోగ్య శాఖ ఆదేశాలు ఇచ్చింది. దీని ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి 10 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. బీపీటీ, ఎంపీటీ, ఎమ్మెస్సీ నర్సింగ్, పీబీబీఎస్సీ నర్సింగ్ కోర్సులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేయనున్నారు.

## రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. తెలుగు రాష్ట్రాల మధ్య స్పెషల్ ట్రైన్స్ నడుపనున్న దక్షిణ మధ్య రైల్వే..!

హైదరాబాద్, ఆగష్టు 29:దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు తెలిపింది. సికింద్రాబాద్ ? నుంచి కాకినాడ టౌన్, కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైళ్లు ఆగష్టు 31 నుంచి, సెప్టెంబర్ 1న రైళ్లు నడుపనున్నట్లు పేర్కొంది. ఈ నెల 31న రైలు నంబర్ 07441 సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 9.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు కాకినాడ చేరుకుంటుందని చెప్పింది. సెప్టెంబర్ ఒకటిన రైలు నంబర్ 07442 కాకినాడ రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకోనున్నది. ఆయా రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట తదితర స్టేషన్లలో ఆగుతుందని పేర్కొంది. ఆయా రైళ్లను ప్రయాణికులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

### నేటి కందం – నేటికి అందం

కం॥ మేదురముగ సోదరిపై
సోదరు నకు గల మమతను జూపుట కొరకై
ఆదరమొప్పెడి గతి-రా
ఖీదినమును జరుపవలయు కేరింతలతోనే !!



–రాధశ్రీ
సెల్:9494481210
(ఆగష్టు 30 రాఖీ పండుగ..)

## ధూప, దీప నైవేద్యానికి మహర్దశ.. అలవెన్స్, వేతనం 10వేలకు పెంచిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆగష్టు 29:తెలంగాణలో ధూప, దీప నైవేద్యం (డీడీఎన్) పథకం కింద అర్చకులకు అందించే అలవెన్స్?ను ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం కేసీఆర్? ఆదేశాల మేరకు ఇవ్వాల (మంగళవారం) ఈ ఉత్తర్వులు జారీ అయినట్టు తెలుస్తోంది.

పురాతన కాలం నుంచి, ఆ తర్వాత వెలిసిన ఆలయాల్లో నిత్యం ఆ దేవుడికి ధూప దీప నైవేద్యాలను సమర్పించేందుకు అర్చకులు ఇబ్బందులు పడడం గుర్తించిన ప్రభుత్వం నిధులు కేటాయించింది.

కాగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడంతో అంతకుముందు ఉన్న రూ.2500 అలవెన్స్?ను రూ.6వేలకు పెంచి అమలు చేస్తోంది. ఈ మొత్తంలో ధూప, దీప నైవేద్యానికి రూ 2వేలు, అర్చకుడికి రూ 4వేలు వేతనం ఇస్తున్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా డీడీఎన్ కింద ఇస్తున్న మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్టు సీఎం ప్రకటించారు. కాగా, ఇందులో అర్చకులకు 6వేల రూపాయలు, ధూప, దీప నైవేద్యాలకు 4వేల రూపాయలను కేటాయించారు. ఈ పథకాన్ని మరికొన్ని దేవాలయాలకు కూడా వర్తింపచేస్తామని సీఎం చేసిన ప్రకటన మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం అందుతోంది. భృతిని పొందే అర్హత వయసు 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తున్నట్టు సీఎం కేసీఆర్ తెలిపారు.

## చేనేతపై బ్రిటీష్ వాళ్లు కూడా పన్నులు వేయలేదు..మోదీ ప్రభుత్వం ఆ పని చేసింది : ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్, ఆగష్టు 29:చేనేత పై బ్రిటిష్ వాళ్లు కూడా పన్నులు విధించలేదని, కానీ చేనేత పై పన్ను విధించిన ఏకైక ప్రభుత్వం ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీదేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఏ పార్టీ ఆలోచన విధానం ఏంటో నేతన్నలు ఆలోచించాలని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక ఎమ్మెల్యే గణేష్‌తో కలిసికవిత పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పద్మశాలీలతో ఆత్మీయ బంధాన్ని పెంపొందించుకునే క్రమంలో తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతూ వచ్చామని తెలిపారు.

52 తర్ప సంఘాలకు కోటి రూపాయల నిధులు

52 తర్ప సంఘాలకు ఇప్పటికే ఇచ్చిన నిధులు కాకుండా మరిన్ని నిధులు ఇస్తే బాగుంటుందని ఎమ్మెల్యే బిగాల గణేష్ విజ్ఞప్తి చేశారని, దాంతో 52 తర్ప సంఘాల భవనాల నిర్మాణాలకు తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ. కోటి ఇస్తున్నానని ప్రకటించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి పథకాలు అందేలా కుల సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘాల పనితీరుపై కూడా పునరాలోచన చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ రాకముందు పద్మశాలలీల కులవృత్తి ప్రమాదంతో ఉండేదని, ఆ సామాజికవర్గానికి చెందిన వారికి ఎక్కువ భూములు కూడా లేవని చెప్పారు. దాంతో బాగా చదువుకొని చాలా మంది డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా ఆయా వృత్తుల్లో స్థిరపడ్డారని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అనేక మంది పద్మశాలీలు పేదరికంలో ఉండడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పద్మశాలీలు వ్యాపారంలో కూడా ఉన్నారని, వ్యాపారానికి శాంతి భద్రతలు ఎంత ముఖ్యమో అందరికీ తెలుసునని అన్నారు. శాంతి భద్రతలను పుష్కలంగా ఇస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని వస్పష్టం చేశారు.

బట్టల వ్యాపారస్తులకు ప్రోత్సాహకాలు

బట్టల వ్యాపారస్తులకు అనేక ప్రోత్సాహకాలు కేసీఆర్ ప్రభుత్వం ఇస్తుందని, 24 గంటల నిరంతర విద్యుత్తు ఇస్తుండడం వల్ల బట్టల దుకాణాల్లో డీజిల్ కంపు లేదని వివరించారు. గత ప్రభుత్వాలు చేనేత పరిశ్రవను కుదేలు చేశాయని విమర్శించారు. బీడీ కార్మికులకే కాకుండా టేకేదారుల కు కూడా పెన్షన్ అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని తేల్చి చెప్పారు. మూడోసారి గణేష్‌కు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో గణేష్ కు అండగా నిలబడి ఆశీర్వదించి మరోసాని శానన సభకు వంపించాలని విజ్ఞప్తి చేశారు.

## చంద్రయాన్-3 మిశన్ యొక్క చరిత్రాత్మక సాఫల్యాన్ని ఘనంగా స్మరించుకొంటూ మంత్రివర్గ తీర్మానం

న్యూఢిల్లీ, ఆగష్టు 29:జాబిల్లి చెంతకు చేరుకోవడం కోసం తలపెట్టిన చంద్రయాన్-3 మిశన్ యొక్క చరిత్రాత్మక సాఫల్యాన్ని ఘనం గా జరుపుకోవడాని కి దేశ ప్రజల తో కేంద్ర మంత్రిమండలి చేతులు కలిపింది. మన శాస్త్రవేత్తల బ్రహ్మాండమైన కార్యసాధన ను మంత్రిమండలి ప్రశంసించింది. ఇది మన అంతరిక్ష సంస్థ కు లభించిన విజయం ఒక్కటే కాదని, ఇది భారతదేశం యొక్క పురోగతి లో ఒక ప్రకాశవంతమైన సూచిక మరియు ప్రపంచ రంగస్థలం లో ఒక ఉన్నతమైన సోపానం గా కూడా ఉంది. ఆగష్టు 23 వ తేదీ ని "జాతీయ అంతరిక్ష దినం" గా ఘనం గా పాటించడం జరుగుతుందని మంత్రిమండలి పేర్కొంది.

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఐఎస్ఆర్ఒ) కు, ఆ సంస్థ యొక్క ప్రయాసల కు గాను మంత్రివర్గం అభినందనల ను తెలియ జేసింది. మన శాస్త్రవేత్తల సౌజన్యం తో భారతదేశం చంద్రుని దక్షిణ ధృవం సమీపం లో అడుగిడిన ఒకటో దేశం గా భారతదేశం ఖ్యాతి ని గడించింది. జాబిల్లి పై కాలుపెట్టే ఘట్టం దానంతట అదే ఒక మహత్తరమైన కార్యసిద్ధి అని చెప్పాలి. చందమామ దక్షిణ ధృవం సమీపం లో కాలూనడం మన శాస్త్రవేత్త ల యొక్క ఉత్సాహాని కి ఒక నిదర్శనం. వారు శతాబ్దాల తరబడి మానవ జ్ఞానాని కి ఉన్న ఎల్లలను చెరిపివేసేందుకు ప్రయత్నించారు. 'ప్రజ్ఞాన్' రోవర్ చంద్రుని కి సంబంధించిన సమాచార ఖజానా ను కొంచెం కొంచెం గా చేరవేస్తూ ఉండటం సంబంధిత జ్ఞానాన్ని విస్తరిస్తూ, చంద్రగ్రహం తాలూకు రహస్యాల ను చేధించడం తో పాటుగా, అపూర్వమైన విషయాల ను కనుగొనేందుకు బాట ను పరచగలదు.

సాంకేతిక విజ్ఞానం పరం గా త్వరితగతిన నమోదు అవుతున్న పురోగతి మరియు నూతన ఆవిష్కరణల పట్ల తహతహలు ఒక ఆనవాయితీ గా మారిన యుగం లో భారతదేశం యొక్క శాస్త్రవేత్తలు జ్ఞానాని కి, సమర్పణ భావాని కి మరియు ప్రావీణ్యాని కి ఉజ్వల మార్గదర్శులు గా నిలచారని మంత్రిమండలి గట్టిగా నమ్ముతున్నది. వారి యొక్క విశ్లేషణ సామర్థ్యం ప్రతిదీ తరచి చూసే మరియు ఆరా తీసే తరగని నిబద్ధతలు దేశాన్ని ప్రపంచం లో విజ్ఞాన శాస్త్ర సంబంధి కార్యసిద్ధుల పరంపర లో అగ్రగామి గా నిలచేందుకు తోడ్పడుతూ వచ్చాయి. ఉత్కృష్టత సాధన లో వారు పట్టువిడువక ప్రదర్శిస్తున్న తెగువ ఎక్కడా తలొగ్గని తపన, సవాళ్ళ ను అధిగమించాలనే అజేయమైన ఉత్సాహం అంతర్జాతీయ యవనిక పైన వారి ప్రతిష్ట ను దృఢతరం చేయడం ఒక్కటే కాకుండా, అన్యులు కూడా పెద్ద పెద్ద కలల ను కనడం మరియు ప్రపంచం లో జ్ఞానం యొక్క విశాల ముఖచిత్రాని కి వారి వంతు గా తోడ్పాటును అందించడాని కి తగిన ప్రేరణ ను కూడా అందించాలి.

చంద్రయాన్-3 విజయం లో మహిళా శాస్త్రవేత్తలు పెద్ద సంఖ్య లో వారి యొక్క తోడ్పాటును అందించడం చూస్తే మంత్రిమండలి కి అది ఒక గర్వకారణం గా ఉంది. అంతేకాదు, అది రాబోయే కాలాల్లో మహత్వాకాంక్ష కలిగిన మహిళా శాస్త్రవేత్తలు అనేక మంది కి స్ఫూర్తిని ఇవ్వనున్నది.

భారతదేశం యొక్క అంతరిక్ష కార్యక్రమం మానవ సంక్షేమం కోసం మరియు విజ్ఞాన శాస్త్ర సంబంధి ప్రగతి కోసం అండగా నిలవాలన్న భారతదేశం యొక్క అచంచలమైనటువంటి తోడ్పాటుకు తోడు, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యొక్క దార్శనికత మరియు మార్గదర్శక ప్రాయమైనటువంటి నాయకత్వాల ను మంత్రిమండలి అభినందిస్తోంది. మన శాస్త్రవేత్తల సత్తా పట్ల ఆయన కు ఉన్న విశ్వాసం మరియు నిరంతరాయ ప్రోత్సాహం వారి లో ఉత్సాహాన్ని ఇంతలంతలు చేసివేస్తూ వస్తున్నాయి.

తొలుత గుజరాత్ రాష్ట్రం, మరి ఆ తరువాత ప్రధాన మంత్రి గా 22 సంవత్సరాల సుదీర్ఘ కాలం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి చంద్రయాన్ మిశన్ లు అన్నింటితో భావోద్వేగ పరమైన అనుబంధం ఉంది. పూర్వ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ గారు ఆ తరహా మిశన్ ను ఒకదానిని గురించి ఆలోచన చేసినప్పుడు శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి గా సేవల ను అందిస్తూ ఉన్నారు. చంద్రయాన్-1 ని 2008 వ సంవత్సరం లో ఫలప్రదం గా ప్రారంభించడం జరిగిన వేళ ఆయన ఇస్రో ను సందర్శించి శాస్త్రవేత్తల కు తన అభినందనల ను వ్యక్తం చేశారు. 2019వ సంవత్సరం లో చంద్రయాన్-2 విషయాని కి వస్తే భారతదేశం అంతరిక్ష రంగం లో జాబిల్లి ఉపరితలాని కి కేవలం కొన్ని అడుగుల దూరం వరకు భారతదేశాన్ని చేర్చింది. ప్రధాన మంత్రి యొక్క విచక్షణ భరితమైన నాయకత్వం మరియు ఆప్యాయతలు శాస్త్రవేత్తల లో ఉత్సాహాన్ని ఇనుమడింపజేసి వారిని కృతనిశ్చయులు గా తీర్చిదిద్ది, మరి వారు ఈ మిశన్ ను మరింత విశాలమైన ఉద్దేశ్యాల కోసం అనుసరించేటట్లుగా వారిలో ప్రేరణ ను నింపింది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎల్లవేళలా విజ్ఞాన శాస్త్రాన్ని మరియు నూతన అన్వేషణల ను ప్రోత్సహిస్తూ వచ్చారు. గడచిన తొమ్మిది సంవత్సరాల లో ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలు పరిశోధనల ను, నూతన ఆవిష్కరణల ను సులభతరం చేసి వేశాయి. అంతరిక్ష రంగం లో ప్రైవేటు రంగాని కి మరియు మన స్టార్ట్-అప్ సంస్థల కు మరిన్ని అవకాశాలు దక్కేటట్లుగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చర్యలు తీసుకున్నారు. ఇన్-స్పేస్ (ఎఔ-ాఖంఅవ)ను అంతరిక్ష విభాగం అధీనం లో పని చేసే ఒక స్వతంత్ర సంస్థ గా ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమ సంబంధి ఇకో-సిస్టమ్ ను సృష్టించడం జరిగింది. 2020 వ సంవత్సరం జూన్ లో గ్లోబల్ స్పేస్ ఇకానమి లో ఒక ప్రధానమైన వాటా ను దక్కించుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఉండింది. అది అంతరిక్ష జగతి లో భారతదేశం యొక్క పురోగతి కి ఒక మెట్టుగా మారింది. హ్యాకథన్ లపై శ్రద్ధ తీసుకోవడం తో భారతదేశం లో యువతీ యువకుల కు అనేక అవకాశాల కు తలుపులు తెరుచుకొన్నాయి.

చంద్రుని ఉపరితలం పైన రెండు బిందువుల కు 'తిరంగా' పాయింట్' (చంద్రయాన్-2 యొక్క పాదముద్ర) మరియు 'శివశక్తి' పాయింట్ (చంద్రయాన్-3 అడుగుపెట్టిన ప్రదేశం) లకు నామకరణం చేయడాన్ని మంత్రిమండలి స్వాగతిస్తున్నది. ఈ పేరులు మన గత కాలం యొక్క సారాన్ని ఎంతో సుందరమైన రీతి లో ప్రతిబింబిస్తున్నాయి. అదే కాలం లో ఆధునికత కు కూడా పెద్దపీట వేస్తున్నాయి. ఈ పేరులు కేవలం నామాలు మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువ. అవి వేల సంవత్సరాల మన విజ్ఞాన శాస్త్ర మహత్వాకాంక్షల సంప్రదాయం తో పెనవేసుకొన్న లంకెలు.

చంద్రయాన్-3 యొక్క సాఫల్యం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన "జయ్ విజ్ఞాన్, జయ్ అనుసంధాన్" నినాదాని కి గొప్ప ప్రమాణాల లో ఒకటి గా ఉంది. అంతరిక్ష రంగం ఇక మీదట భారతదేశం లో వర్ధిల్లుతున్న స్టార్ట్-అప్ సంస్థల కు మరియు ఎమ్ఎస్ఎమ్ఇ లకు ఇతోధిక అవకాశాల ను ఇవ్వజూపడమే కాకుండా, లక్షల కొద్దీ నౌకరీల ను కల్పిస్తుంది. క్రొత్త క్రొత్త విషయాల ను కనుగొనేందుకు దారిని పరుస్తుంది. ఇది భారతదేశం లో యువత కు సంభావ్యత ల నిధిని ప్రసాదిస్తుంది.

చంద్రయాన్-3 మిశన్ యొక్క విజయం తో అందేటటువంటి జ్ఞానాన్ని మానవాళి మేలుకు మరియు పురోగతి కి ఉపయోగించడం జరుగుతుందని నిర్వివాదం గా వెల్లడి చేస్తున్నాం. మరీ ముఖ్యం గా అంతగా అభివృద్ధి చెందని దేశాల విషయం లో ఇది జరుగుతుంది. 'వసుధైవ కుటుంబకం' పట్ల మనకు ఉన్నటువంటి చిరకాలిక విశ్వాసం యొక్క స్ఫూర్తి ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మరోమారు నిరూపించడం జరిగింది. భారతదేశం లో పురోగతి యొక్క జ్యోతులు ఇతర దేశాల లో ప్రజల జీవనాన్ని సైతం కాంతులీనేటట్లు చేస్తూ ఉంటుంది.

అంతరిక్ష రంగం లో భారతదేశం వేస్తున్న ముందంజలు కేవలం విజ్ఞాన శాస్త్ర సంబంధి మహత్తర కార్యసాధనల కంటే మించినవని మంత్రిమండలి నమ్ముతున్నది. అవి పురోగతి యొక్క, ఆత్మనిర్భరత యొక్క మరియు ప్రపంచ నేతృత్వం యొక్క దృష్టికోణాని కి ప్రాతినిధ్య వహిస్తున్నాయి. ఇవి ఉదయిస్తున్నటువంటి 'న్యూ ఇండియా' ఒక ప్రతీక గా కూడా ఉంది. ఈ అవాకాశాన్ని మరిన్ని అనుకూలతల ను సృష్టించడం కోసం వినియోగించుకోవాలని మన తోటి పౌరుల కు మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ క్రమం లో మానవనిర్మిత ఉపగ్రహ సమాచార వ్యవస్థ మొదలుకొని, వాతావరణ అధ్యయనం నుండి వ్యవసాయం వరకు, ఇంకా విపత్తుల నిర్వహణ తదితర రంగాల లో ఈ అవకాశాలను కల్పించడానికి వీలు ఉంది. మన నూతన ఆవిష్కరణలు క్షేత్ర స్థాయి లో ఉపయోగం లోకి వచ్చేటట్లు మన మౌలిక సదుపాయాల ను వృద్ధి చెందింప చేసేటట్లు మన డిజిటల్ ఇకానమి కి అండదండల ను అందించేటట్లు మరియు విభిన్న రంగాల కు కీలకమైన డేటా ను అందుబాటు లోకి తీసుకొని వచ్చేటట్లు మనం చూడాలి.

విజ్ఞానం శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, ఇంకా నూతన ఆవిష్కరణల తో కూడిన ఈ యుగం లో మంత్రిమండలి ప్రత్యేకం గా విద్య జగతి తో అనుబంధం కలిగిన వర్గాని కి చేస్తున్న విజ్ఞప్తి ఏమిటి అంటే, అది మరింత మంది యువజనులు విజ్ఞాన శాస్త్రం వైపు మళ్ళేటట్లుగా వారి లో ప్రేరణ ను పాదుగొల్పాలన్నదే. చంద్రయాన్-3 యొక్క సాఫల్యం ఈ రంగాల లో ఆసక్తి తాలూకు అగ్గిరవ్వ ను రాజేయడాని కి ఒక బ్రహ్మాండమైన తరుణోపాయాన్ని అందించింది. అంతేకాదు, మన దేశం లో అవకాశాల తాలూకు తలుపుల ను కూడా బార్లా తెరచింది.

## వినాయక చవితి ఏరోజు

## 18 లేదా 19.. క్లారిటీ ఇచ్చిన పండితులు!

హైదరాబాద్, ఆగష్టు 29:వినాయక చవితి ఏ రోజు నిర్వహించుకోవాలన్న విషయంలో చాలామందిలో సందిగ్ధం ఉండేది. ఈ విషయంలో క్లారిటీ ఇస్తూ ఓ ప్రకటన జారీ చేశారు పండితులు. వినాయక చవితి పర్వ దినాన్ని సెప్టెంబర్ 18వ తేదీన జరుపుకోవాలని తెలంగాణ విద్వత్సభ ఇవ్వాల (మంళవారం) ప్రకటించింది. శోభకృత్?నామ సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్థి రోజునే మధ్యాహ్నం వరకు చవితి తిథి ఉన్నందున అదే రోజున వినాయక చవితిగా నిర్వహించుకోవాలని నిర్ధారించినట్టు విద్వత్సభ అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి తెలిపారు.

కాగా, చవితి తిథి 18న ఉదయం 9.58 ఆరంభమై 19వ తేదీ ఉదయం 10.28కి ముగుస్తుందని తెలిపారు. దీని ప్రకారం చవితి తిథి మధ్యాహ్నం 18వ తేదీన ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్? కార్యాలయాలకు, ప్రభుత్వ సలహాదారులకు కూడా తెలియజేసినట్టు పేర్కొన్నారు.

## సెప్టెంబర్‌లో వర్షాలు లేనట్టేనా..!

### ఆందోళన వ్యక్తం చేస్తున్న వాతావరణశాఖ..!

హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఏడాది రుతుపవనాలు అత్యంత బలహీనంగా మారాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా సెప్టెంబర్‌లోనూ వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం లేదని, ఇప్పటికే ఆగస్టు నెలంతా వాతావరణం పొడిగానే ఉందంటూ వాతావరణ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. దీంతో దేశంలో ఈ ఏడాది జూన్‌లో లోటు వర్షాపాతం ఏర్పడింది. ఆ తర్వాత రుతుపవనాలు చురుగ్గా మారడంతో దేశవ్యాప్తంగా అత్యధిక వర్షాపాతం నమోదైంది. జులైలో 489.9 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డు కాగా.. లోటు తీరినట్లయ్యింది.సాధారణ సగటు కంటే జూన్‌లో తొమ్మిది శాతం తక్కువ లోటు ఉండగా.. జులైలో 13శాతం ఎక్కువగా నమోదైంది. మరో వైపు సెప్టెంబర్ 17 నుంచి రుతుపవనాలు వెనక్కి మళ్లనున్నారు. రుతుపవనాల ఉపసంహరణ ఆలస్యం కారణంగా గత నాలుగేళ్లుగా సెప్టెంబర్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాపాతం నమోదవుతున్నప్పటికీ.. తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. వార్షిక సగటు వర్షాపాతంలో 70శాతం రుతుపవనాల సమయంలోనే నమోదు అవుతుండడం గమనార్హం. వర్షాపాతం తగ్గితే నిత్యావసర చక్కెర, పప్పులు, కూరగాయల ధరలు పెరిగే అవకాశం పెరిగే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తెలంగాణలో 1972 తర్వాత..

తెలంగాణలో 1972 తర్వాత ఆగస్టులో తెలంగాణలో అత్యల్పంగా వర్షాపాతం నమోదైంది. ఆగస్టులో కేవలం 74.4 మిల్లీమీటర్ల వర్షాపాతం మాత్రమే నమోదు కాగా.. ఇది సాధారణం కంటే 60శాతం తక్కువ. 1960 నుంచి రాష్ట్రంలో ఇంత తక్కువగా వర్షాపాతం నమోదవడం ఇది మూడోసారి. 1960లో 67.9 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదవగా.. 1968లో 42.7 మిల్లీమీటర్లు, 1972లో 83.2 మిల్లీమీటర్లు.. ప్రస్తుతం ఆగస్టులో 74.4 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. సాధారణంగా తెలంగాణలో 120 రోజులు వర్షాకాలం ఉంటుందని, 60-70 రోజులు మంచి వర్షాలు కురుస్తాయని.. మిగతా రోజుల్లో అడపదడపా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో జూన్‌లో లోటు ఏర్పడిందని, జులైలో మంచి వర్షాలు కురిసినా.. ఆగస్టులో వరుణుడు ముఖం చేశాడు. లోటు వర్షపాతానికి ఎల్ నినో ప్రధాన కారణమని నిపుణులు వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## చలో మైదాన్ అవగాహన కార్యక్రమం




సంగారెడ్డి, ఆగష్టు 29 (నేటినిజం ప్రతినిధి): జాతీయ క్రీడా దినోత్సవం ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా చలో మైదాన్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా యువజన మరియు క్రీడా శాఖా సూపరెండెంట్ జావిద్ అలీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ మైదానంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏజేసి చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ డిడి అఖిలేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు మరియు యువకులు ప్రతిరోజు కనీసం అరగంటసేపు వారికి నచ్చిన ఆటలు ఆడాలని, వ్యాయామం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులచే ప్రతిజ్ఞను చేయించడం జరిగినది. హాకి, ఫుట్బాల్, రెజ్లింగ్ లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పి రమేష్ కుమార్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, సంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ 6వ వార్డ్ కౌన్సిలర్ సోహెల్ అలీ, ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వో, హనుమంత్ గౌడ్, అమూల్య, స్విమ్మింగ్ కోచ్ శ్రీనివాస్ గౌడ్, జమునస్టిక్ కోచ్ దేవిక, క్రీడాకారులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# వరల్డ్ గేమ్స్‌లో తెలంగాణ పోలీస్ అధికారికి పతకాలు

## – తెలంగాణ పోలీసుకు గర్వకారణమన్న డీజీపీ అనిల్‌కుమార్



హైదరాబాద్ ఆగష్టు 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కెనడాలో జరిగిన వరల్డ్ గేమ్స్‌లో తెలంగాణ పోలీస్ అధికారి పతకాలు సాధించడం తెలంగాణ పోలీసుకు గర్వకారణమని డీజీపీ అనిల్‌కుమార్ అన్నారు. జులై 28 నుంచి కెనడా లోని విన్నిపెగ్‌లో వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ ? 2023 లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో పాల్గొని పతకాలు సాధించిన రాచకొండ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, రోడ్ సేఫ్టీ వింగ్ అధికారిణి శ్రీబాలను మంగళవారం డీజీపీతో పాటు వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ ఏడీజీపీ అభిలాషా బిష్త్, లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్ సత్కరించారు. వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌లో పాల్గొన్న ఏకైక తెలంగాణ పోలీసు క్రీడాకారిణి ఆమె అని డీజీపీ ప్రశంసించారు. ఆమె అసాధారణమైన నిబద్ధత, పోటీలో ప్రదర్శించిన కృషి వల్ల ఆమె పతకాలు సాధించిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాల నుంచి 8,000 మంది పోలీసు, అగ్నిమాపక అథ్లెట్లు 60 కంటే ఎక్కువ క్రీడలలో పోటీ పడ్డారని వివరించారు. టేబుల్ టెన్నిస్ లో బి శ్రీబాల 40 ప్లస్ మహిళల డబుల్స్‌లో రజత పతకాలు, 40 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో, 40 ప్లస్ మహిళల సింగిల్స్‌లో కాంస్య పతకాలను గెలుచుకుందని వెల్లడించారు. బ్యాడ్మింటన్ లో 40 ప్లస్ మహిళల సింగిల్స్‌లో బంగారు పతకం, మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుందని అన్నారు. మొత్తంగా, ఆమె భారతదేశానికి ఒక స్వర్ణం , రెండు రజత, కాంస్య పతకాలతో సహా ఐదు పతకాలను గెలుచుకుందని డీజీపీ పేర్కొన్నారు.

# ప్రజోపయోగ పనులను సకాలంలో పూర్తి చేయించాలి -దిశా సమావేశంలో ఎం.పీ అర్వింద్



నిజామాబాద్, ఆగష్టు 29:ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని, పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ(దిశా) సమావేశం జరిగింది.

కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఎజెండా అంశాల వారీగా సమావేశంలో చర్చించారు. ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, కంపా నిధులతో చేపట్టిన పనులు, ట్రిపుల్ ఆర్ పథకం కింద చెరువుల ఆయకట్టు స్థిరీకరణ, మరమ్మతులు, జాతీయ ఆరోగ్య మిషన్, ఫసల్ బీమా, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వనిధి, రూర్బన్, ముద్ర రుణాల పంపిణీ, విద్యాభివృద్ధి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఆయా పథకాల కింద కేంద్ర నిధులతో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తాత్సారం జరుగుతోందని అన్నారు. మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద అప్రోచ్ రోడ్ నిర్మాణంతో పాటు ఆయాచోట్ల ఆర్ఓబి నిర్మాణ పనులు ఎందుకు మందకొడిగా కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులను వివరణ కోరారు. ఇప్పటికే గడువు ముగిసినా పనులు కొలిక్కి రాలేకపోతున్నాయని అన్నారు. నిర్దిష్ట గడువులోపు పనులను పూర్తి చేయడంలో విఫలమవుతున్న కాంట్రాక్టర్లపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవిమామిడిపల్లి ఆర్వోబి, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అలాగే, మామిడిపల్లి, బోధన్, ఆర్మూర్ ఆర్.ఓ.బీ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తయి ప్రజలకు వసతులు అందుబాటులోకి వచ్చినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఆయా పనులు ఏ దశల్లో కొనసాగుతున్నాయి, వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు తనకు సమర్పించాలని ఆర్ అండ్ బి, ఇరిగేషన్, వ్యవసాయ, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపర్చి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చొరవ చూపాలని సంబంధిత అధికారులకు హితవు పలికారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరయ్యిందా అని ఎం.పీ ఆరా తీశారు.

దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ వివరణ ఇస్తూ, గతేడాది ప్రకృతి వైపరీత్యాలతో పంటలు కోల్పోయిన వారికి పరిహారం మంజూరయ్యిందని, ఈ ఏడాది పంటలు నష్టపోయిన వారి జాబితాను ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన చోట లబ్దిదారులను ఎంపిక చేసి త్వరితగతిన ఇళ్లను కేటాయించాలని ఎం.పీ సూచించగా, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 42 వేల దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయి పరిశీలన జరిపించి అందులో 30 వేల మంది వరకు అర్హులు ఉన్నారని గుర్తించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. గృహలక్ష్మి పథకానికి చివరి గడువు అంటూ ఏమీ లేదని, నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతపర్చని వారి నుండి సైతం దరఖాస్తులు సవీకరించడం జరిగిందని సభ్యులకు వివరించారు.

కాగా, ప్రభుత్వ బడులలో విద్యార్థులకు మధ్యాన్న భోజనంలో గుడ్డు అందించడం లేదని సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలకాలపై ఆ వివరాలను పొందుపర్చడం లేదని పలువురు సభ్యులు సమావేశంలో ఆక్షేపణ తెలిపారు.

దీనిపై ఎం.పీ స్పందిస్తూ, తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ నిధుల వివరాలను పొందుపర్చాలని అధికారులకు సూచించారు. 2016 నుండి ఇప్పటివరకు జిల్లాలో ముద్ర లోన్స్ కింద 1,58,694 మందికి 2264.88 కోట్ల రూపాయల రుణాలు అందించడం జరిగిందని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ తెలుపగా, ముద్ర రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎం.పీ సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, డీ ఎఫ్ ఓ వికాస్ మీనా, డీ ఆర్ డీ ఓ చందర్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా చండియాగం- వేద పండితులతో ప్రత్యేక పూజలు

నిజామాబాద్, ఆగష్టు 29:నిజామాబాద్ నగర తొలి మేయర్, కాంగ్రెస్ నాయకుడు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ నగరంలోని సంజయ్ స్వగృహంలో చండి యాగం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో వేద పండితులు మండపా రాధన, గణపతి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో అమ్మవారికి పంచామృతాలు, విశేష ద్రవ్యా లతో అభిషేకాలు ఈ సందర్బంగా డి.సంజ య్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం యాగాన్ని నిర్వ హిం చడం గొప్ప అనుభూతి అని, భగవంతుని కృపతో ప్రజలందరికీ విజయాలు సిద్ధించాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. యాగం అనంతరం భక్తులకు అన్నధాన కార్యక్రమం నిర్వహిం చారు చండియాగం ముగిసిన వెంటనే వర్షం పడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.






Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.